www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,70306545

సంపుటి - 2 సంచిక -165 సోమవారం 26 ఆగష్టు 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



## పార్టీ మారడం లేదనే పల్లాను టార్గెట్ చేశారు : హరీశ్ రావు

(హైదరాబాద్):ఆగస్టు 25 ప్రజావినికిడి:
మేడ్చల్ మల్కాజిగిరిలోని అనురాగ్ యూనివర్సిటీ భవనాలు అక్రమ నిర్మాణాలు అంటూ తెలంగాణ ఇరిగేషన్ శాఖ పోలీసులకు ఫిర్యాదు చేయడం తెలిసిందే. దాంతో, బీఆర్ఎస్ ఎమ్మెల్యే, వర్సిటీ చైర్మన్ పల్లా రాజేశ్వర్ రెడ్డిపై కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో, హైడ్రా కూల్చివేతలపై బీఆర్ఎస్ నేత హరీశ్ రావు స్పందించారు.కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని మండిపడ్డారు. రాజకీయంగా ఎదుర్కోలేకే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై ఈ విధంగా దాడులు చేస్తున్నారని, హైడ్రా పేరుతో కూల్చివేతలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. హైడ్రాను రాజకీయ కక్ష సాధింపు చర్యలకు వాడుకుంటున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. పల్లా రాజేశ్వర్ రెడ్డిపై అక్రమంగా కేసులు పెట్టారని, ఆయనను ఆర్థికంగా ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే... బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రేవంత్ రెడ్డి టార్గెట్ చేసినట్టుగా కనిపిస్తోందని అన్నారు. పార్టీ మారడంలేదని పల్లాను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని హరీశ్ రావు ఆగ్రహం వెలిబుచ్చారు. రాష్ట్రంలో ప్రజలు విష జ్వరాలతో అల్లాడుతుంటే, హైడ్రా పేరుతో హైడ్రామా సృష్టిస్తూ ప్రజల దృష్టి మరల్చేందుకు ప్రయత్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులపై రాజకీయ కక్ష చూపొద్దని హితవు పలికారు.

# ఆక్రమదారుల భరతంపడతాం



- భగవద్గీత బోధనానుసారం చెరువులను కాపాడుతున్నాం
- కొందరు శ్రీమంతుల స్వార్థం నీటివనరుల ధ్వంసం
- ఆక్రమణదారులు ప్రభుత్వంలో ఉన్నా వదలం
- కూల్చివేతలు ఆగవు
- నీటివనరులే భవిష్యత్ తరాలకీ తరగని ఆస్తులు
- ప్రకృతిని ధ్వంసం చేస్తే అది మనపై కక్ష కడుతుంది
- హారేకృష్ణ సంస్థ అనంత శేష స్థాపన ఉత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరిక

(హైదరాబాద్):ఆగస్టు 25 ప్రజావినికిడి:భగవద్గీత స్ఫూర్తితోనే అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తున్నామని, ఎవరు ఎంత ఒత్తిడి తెచ్చినా చెరువులు అక్రమించిన వారి భరతం పడతామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అధర్మం ఓడాలంటే యుద్ధం త ప్పదన్న కృష్ణుడి మాటలు తనకు స్ఫూర్తినిచ్చాయని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. శ్రీకృష్ణ భగవానుడి బోధనానుసారం చెరువులను కాపాడుతున్నామని ఆయన తెలిపారు. మహానగరంలో చెరువులను చెరబట్టిన వారిపై ఉక్కుపాదం మోపుతున్నామని సిఎం రేవంత్ వెల్లడించారు. కోకాపేట్ అక్షయ పా త్ర ఫౌండేషన్ సమీపంలో హరేకృష్ణ హెరిటేజ్ టవ ర్ ఆధ్వర్యంలో అనంత శేషస్థాపన ఉత్సవంలో సిఎం రేవంత్ పాల్గొని మాట్లాడారు. అక్రమార్కుల నుంచి చెరువులను విముక్తి చేస్తున్నామని ఆయన తెలిపారు. చెరువులు మనవాళికి జీవనాధారమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కొందరు శ్రీమంతులు వాటిలో ఫాంహౌజ్‌లను నిర్మించారని సిఎం రేవం త్ అసహనం వ్యక్తం చేశారు. అక్రమార్కుల నుంచి చెరువులను విముక్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను రక్షించుకోవాల్సిన బాధ్య త అందరిపై ఉందన్నారు. నిజాం ఆనాడే హైదరాబాద్‌ను లేక్ సిటీగా గుర్తించి గొలుసు కట్టు చెరువుల నిర్మాణాలు చేపట్టారని సిఎం రేవంత్ తెలిపారు. కరువు వచ్చిన సమయంలో గండిపేట, ఉస్మా న్ సాగర్ హైదరాబాద్ దాహార్తిని తీర్చుతున్నాయ ని, కానీ, కొందరు ధనవంతులు చెరువుల పక్కనే ఫాంహౌస్‌లు కట్టుకొని, ఆ నాలాలు గండిపేటలో కలిపారని, ఇప్పుడు వాటిని తాగునీటిగా ఉపయోగించేందుకు ఇబ్బందిగా మారిందని సిఎం రేవంత్ తెలిపారు.

మిగతా 2లో.

## జిహెచ్ఎంసి ఆఫీస్‌ను కూల్చేస్తారా



2లో.

- నెక్లెస్‌రోడ్‌ను తవ్వేస్తారా?
- ఆ రెండూ ఎఫ్‌టిఎల్ పరిధిలోనివే
- గోల్కొండ చెరువులో ఉన్న గోల్ఫ్‌కోర్స్‌ను నేలమట్టం చేస్తారా?
- ప్రభుత్వానికి ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ప్రశ్నలు




2లో.

## రూ. 175కోట్ల భారీ సైబర్ క్రైమ్

- పాతబస్తీ కేంద్రంగా షంషీర్‌గంజ్ ఎస్‌బిఐలో సైబర్ నేరగాళ్ల మాయ
- పేదల పేరుతో ఖాతాలు తెరిచి క్రిప్టో కరెన్సీ ద్వారా కొంత డబ్బు దుబాయ్‌కి తరలింపు
- ఇద్దరిని అరెస్టు చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో.. విచారణ వేగవంతం

## రేపటి నుంచి రుణమాఫీ కాని వారి వివరాల సేకరణ



(హైదరాబాద్):ఆగస్టు 25 ప్రజావినికిడి:
అర్హులై రుణమాఫీ కాని రైతుల వివరాల నమోదుకు 'రైతుభరోసా పంట రుణ మాఫీ యాప్'ను ప్రభుత్వం తీసుకొచ్చింది. రేపటి నుంచి వారి వివరాలను నమోదు చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించింది. రూ. 2లక్షల లోపు మాఫీ కాని వారి రుణఖాతాలు, ఆధార్ కార్డు తనిఖీ చేసి కుటుంబ సభ్యుల వివరాలను యాప్లో అప్లోడ్ చేయాలంది. కాగా రూ. 2 లక్షలు దాటిన వారి విషయంలో రుణమాఫీ ఎప్పుడు చేస్తామనేది ప్రభుత్వం వెల్లడించలేదు.

## తెలంగాణపై ఫోకస్

### టీటీడీపీ బలోపేతం టీటీడీపీ కమిటీలన్నీ రద్దు



2లో.

## కర్ణాటక వాల్మీకి స్కామ్‌లో రాష్ట్ర కాంగ్రెస్‌కు లింకులు

- పార్లమెంట్ ఎన్నికలకు ముందు రూ.45కోట్లు హైదరాబాద్‌లోని 9 బ్యాంక్ ఖాతాలకు వెళ్లాయి..వాళ్లెవరు?



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఆక్రమదారుల భరతం పడతాం

(మొదటి పేజి తరువాయి)

అలాంటి అక్రమ నిర్మాణాలను వదిలేస్తే ప్రజా ప్రతినిధిగా తాను విఫలమైనట్లేనని, అందుకే ఎవరు ఎంత ఒత్తిడి చేసినా మిత్రులకు ఫాంహౌజ్ లు ఉన్నా హైడ్రా అనే సంస్థను ఏర్పాటు చేసి, చెరువులను ఆక్రమించిన వారిపై ఉక్కుపాదం మోపుతున్నామని సిఎం రేవంత్ అన్నారు. ఇందులో ప్రభు త్వ భాగస్వామ్యం ఉన్నవారు ఉండొచ్చు, సమాజా న్ని ప్రభావితం చేసే వారు ఉండొచ్చు, ఎవరిని ప ట్టించుకోనని సిఎం రేవంత్ స్పష్టం చేశారు. ప్రభుత్వంలో ఉన్న వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేసినా కూల్చివేస్తామని సిఎం రేవంత్ స్పష్టం చేశారు. ఇది రాజకీయాల కోసమో నాయకులపై కక్ష సా ధింపుకోసం చేయడం లేదని,భవిష్యత్ తరాల కో సం అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తున్నామని సిఎం రేవంత్ వివరణ ఇచ్చారు. ప్రకృతి విధ్వంసం చేస్తే ప్రకృతి విలయం ఎలా ఉంటుందో చూస్తున్నామ ని, ఇప్పటికే చెన్నై, ఉత్తరాఖండ్, వయనాడ్‌లలో ఏం జరిగిందో చూశామని ఆయన గుర్తుచేశారు. హైదరాబాద్ ను రక్షించుకోవాల్సిన బాధ్యత మన పై ఉందని, ఇందులో భాగంగానే చెరువులను రక్షణను ప్రభుత్వం బాధ్యతగా తీసుకుందని, ఎవరు ఎంత ఒత్తిడి తెచ్చినా చెరువులు అక్రమించిన వారి భరతం



పడతామని సిఎం హెచ్చరించారు. ఇక హ రే రామ హరే కృష్ణ ట్రస్ట్ ఏ కార్యక్రమం చేపట్టినా దానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తామని, అలాగే పేదల కోసం చేపట్టే పథకాల్లో ట్రస్ట్ సహకారం అందించి, తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో మీ వంతు సహకారం అందించాలని రేవంత్ రెడ్డి కోరారు.

విద్య, వైద్యానికి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యతనిస్తుందని రేవంత్‌రెడ్డి తెలిపారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ధ్యాన కేంద్రాన్ని నిర్మిస్తున్నారని నిర్వాహకులను సిఎం రేవంత్ రెడ్డి ప్రశంసించా రు. ధ్యాన కేంద్రం ప్రారంభోత్సవానికి రావడం అ దృష్టంగా భావిస్తున్నానని ఆయన తెలిపారు. స్థలదాతలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావడం తన జన్మ సుకృతమని సిఎం రేవంత్ తెలిపారు. కాంక్రీట్ జంగిల్ లో ఆధ్యాత్మిక స్ఫూర్తిని అందించేందుకు ఇక్కడ హెరిటేజ్ టవర్ నిర్మించడం గొప్ప విషయమన్నారు. ఈ టవర్ 430 అడుగుల ఎత్తు నిర్మితం కావడం రాష్ట్రానికి గర్వకారణమని 36 లేదా 40 నెలల్లో ఈ టవర్ నిర్మాణం పూర్తి అవుతుందని సిఎం రేవంత్ పేర్కొన్నారు.సమాజంలో వ్యక్తులకు స్ఫూర్తినిచ్చేలా హెరిటేజ్ టవర్ నిర్మాణం జరగాలని సిఎం రేవంత్ ఆశాభావం వ్యక్తం చేశారు. హెరిటేజ్ టవర్ ప్రారంభోత్సవానికి తనను ఆహ్వానించాలని సిఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు కోకాపేట్ ఆర్థికక్షేత్రం అని ఆయన అభివర్ణించారు. హెరిటేజ్ టవర్ నిర్మాణానికి అగర్వాల్ ఆరు ఎకరాలు భూదానం చేశారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా 22 లక్షల స్కూళ్లకు భోజనం అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న చెరువులు అన్యాక్రాంతం కాకుండా సిఎం చేస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు కొనియాడారు. రేవంత్‌రెడ్డి చేస్తున్న గొప్ప కార్యక్రమానికి పెద్దల ఆశీర్వాదాలు ఉండాలని శ్రీధర్‌బాబు అకాంక్షించారు.

## కర్నాటక వాల్మీకి స్కామ్‌లో

# రాష్ట్ర కాంగ్రెస్‌కు లింకులు

(హైదరాబాద్):ఆగస్టు 25 ప్రజావినికిడి:

కర్ణాటకలో వాల్మీకి స్కామ్ తీగ లాగితే డొంకంతా తెలంగాణ కాంగ్రెస్ నేతల వైపు కదులుతోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో తెలంగాణలోని కీలకమైన కాంగ్రెస్ నేతల హస్తం ఉన్నట్లు ఆధారాలు లభిస్తున్నప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. వాల్మీకీ స్కామ్‌లో భారీగా అవినీతి జరిగిందంటూ స్వయంగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధిరామయ్యనే అసెంబ్లీలో అంగీకరించటంతో ఈ మొత్తం స్కాంలో ఉన్న అందరినీ పేర్లు బయటకు రావాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఈ మేరకు బిఆర్ఎస్ పార్టీ యూట్యూబ్ ఛానల్ వేదికగా కెటిఆర్ ఈ అంశంపై పలు ప్రశ్నలను సంధించారు. సరిగ్గా పార్లమెంట్ ఎన్నికలకు ముందు దాదాపు రూ. 180 కోట్లు ప్రభుత్వ సొమ్ము, ప్రభుత్వ అకౌంట్ల నుంచి ఏ కారణం లేకుండా అక్రమంగా దారి మళ్లిందని ఆరోపించారుర. ఈ సొమ్ము అంతా ఎవరికీ ఖాతాలోకి బదిలీ అయిందో ప్రజలకు తెలియాలని అన్నారు. అందులో రూ. 45 కోట్లు హైదరాబాద్‌లోని 9 బ్యాంకు ఖతాలకు బదిలీ చేశారు..? ఆ బ్యాంక్ ఖాతాలు ఎవరివో తేల్చాలి అని కోరారు.ఈ వ్యవహారం బయటకు రాగానే వాల్మీకి కార్పొరేషన్ అకౌంట్స్ సూపరిండెంట్ సూసైడ్



చేసుకోవటం మరింత అనుమానాలకు తావిస్తోందన్నారు. వి6 పేరుతో ఉన్న బిజినెస్ సంస్థకు రూ. 4.5 కోట్లు బదిలీ చేసినట్లు వార్తలు వస్తున్నాయని, అసలు ఆ సంస్థ యాజమాని ఎవరో ప్రజల ముందుంచాలని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఈ డబ్బే తమ ఎన్నికల కోసం వాడినట్లుందని అనుమానం వ్యక్తం చేశారు. వాల్మీకి స్కామ్ వ్యవహారంలో హైదరాబాద్‌లో సిట్, సిఐడి, ఇడిలు దాడులు నిర్వహించినప్పటికీ ఆ సమాచారం మీడియాలో రాకుండా అడ్డుకున్నది ఎవరు..? కెటిఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సహా కీలకమైన కాంగ్రెస్ నేతలు కొంతమంది మీడియాను మేనేజ్ చేసినప్పటికీ మరో నాలుగైదురోజుల్లో అన్ని విషయాలు బయటకొస్తాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో కొన్ని బార్లు, బంగారు దుకాణాల నుంచి భారీగా నగదు విత్ డ్రా చేసినట్లు సమాచారం ఉందని, ఆ బార్లు, బంగారం దుకాణాలను నడుపుతున్నెదవరు..? అని%ౌ% వారికి కాంగ్రెస్ పార్టీతో ఉన్న సంబంధం ఏమిటి..? అని ప్రశ్నించారు.

ఇడి ఎందుకు మౌనంగా ఉందో చెప్పాలి

కర్ణాటక సిఎం సిద్ధిరామయ్యను తొలగిస్తే%ౌ%తెలంగాణ ప్రభుత్వం కూడా కూలిపోతుందని కర్ణాటక మంత్రి సతీష్ జారకిహోళి అనటం వెనుక అంతర్యం ఏమిటి..? అని కెటిఆర్ నిలదీశారు. అంటే కర్ణాటక కాంగ్రెస్, తెలంగాణ కాంగ్రెస్ నేతల మధ్య పెనవేసుకున్న బంధం ఈ వాల్మీకి స్కామేనా..? అని ప్రశ్నించారు. ఈ స్కామ్‌లో తెలంగాణ కాంగ్రెస్ నేతలున్నట్లు పెద్ద ఎత్తున ఆధారాలు కనబడుతున్నప్పటికీ ఇడి ఎందుకు మౌనంగా ఉందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక్కడి నేతలు కాపాడుతున్న శక్తులెవరో ప్రజల ముందుంచాలన్నారు. పార్లమెంట్‌లో అవినీతిపై పెద్ద ఎత్తున మాట్లాడే రాహుల్ గాంధీ%ౌ%ఈ వాల్మీకి స్కామ్ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారని మండిపడ్డారు. అంటే సొంత పార్టీ నేతలు అవినీతి చేస్తే మాఫీయేనా అని విమర్శించారు. వెంటనే రాహుల్ గాంధీ ఈ విషయంపై స్పందించాలని డిమాండ్ చేశారు. మొత్తం వ్యవహారంలో ఉన్న పెద్ద చేపల పేర్లు బయటకు రావాల్సిన అవసరముందని అన్నారు.

# తెలంగాణపై ఫోకస్

(హైదరాబాద్):ఆగస్టు 25 ప్రజావినికిడి:

తెలంగాణలో తెలుగు దే శం పార్టీకి పూర్వవైభవం సాధించడమే లక్ష్యంగా టీటీడీపీ నేతలు, కార్యకర్తలకు ఎపి సిఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో నేతలతో ఆయన ఆదివారం సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో టీడీపీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేయాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని టీడీపీ పాత కమిటీలన్నీ రద్దు చేశారు. ఇకపై అన్ని గ్రామా లు, మండలాలు, జిల్లాల వారీగా సభ్యత్వాలపై ప్రత్యేకంగా ఫోకస్ చేయాలని నేతలకు సూచించారు. సభ్యత్వాలను పెద్ద ఎత్తున నమోదు చేయించిన నేతలకు పార్టీలో తగిన ప్రాధాన్యం ఉంటుందని చంద్రబాబు స్పష్టం చేశారు. తనకు రెండు రాష్ట్రాలు రెండు కళ్లవంటివని, రెండు ప్రాంతాలు సమ అభివృద్ధి చెందాలనేదే టీడీపీ అభిమతమని పేర్కొన్నారు. పార్టీ నుంచి నేతలు వెళ్లిపోయినా గ్రామాల్లో టీడీపీకి బలమైన క్యాడర్ ఉందన్నారు. క్యాడర్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. నేతలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అయితే ఈ సమావేశంలో టీటీడీపీ కొత్త అధ్యక్షుడి ఎంపికపై చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది.పాత కమిటీల రద్దుతో ప్రారంభం : టీటీడీపీ ప్రక్షాళనలో భాగంగా చంద్రబాబు గతంలోనే కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణ టీడీపీలో పాత కమిటీలను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. పార్లమెంట్, అసెంబ్లీ సెగ్మెంట్‌ల వారిగా ఉన్న కమిటీలను రద్దు చేశారు. ఏపీ, తెలంగాణలో ఒకేసారి కొత్త కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. అనంతరమే తెలంగాణ టీడీపీ నూతన అధ్యక్షుడిని ఎంపిక చేస్తారని అంతా భావించారు. ఇదే అంశంపై ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో మరోసారి చర్చ జరగనున్నట్లు సమాచారం. ఏపీ తరహాలోనే కష్టపడి పని చేయాలని కార్యకర్తలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

టీటీడీపీకి యువ రక్తం ఎక్కిస్తాం : తెలంగాణ తెలుగు దేశం పార్టీకి నూతన జవసత్వాలు అందించడానికి ఏపీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఆయన యువ రక్తాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించారు. పార్టీలో యువకులకు ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. ఆదివారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో బాబు టీటీడీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి టీడీపీ శ్రేణులు, అభిమానులు ఎన్టీఆర్ భవన్‌కి తరలివచ్చారు. ఈ సందర్భంగా బాబు రాష్ట్రంలో పార్టీ పటిష్టతపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రానున్న రోజుల్లో పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని సూచించారు. సమావేశం అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ 'మీ అందరినీ కలవడానికి వచ్చాను. తెలుగు ప్రజలు 45 ఏళ్లగా నన్ను ఆశీర్వదిస్తూ వస్తున్నారు. టీడీపీని బలోపేతం చేశారు. అందుకుతగినట్లే పార్టీ నిరంతరం ప్రజలకు సేవ చేస్తోంది. ఈ కార్యక్రమంలో టీటీడీపీని బలోపేతం చేయాలని నిర్ణయించాం. అడహాక్ కమిటీలు రద్దు చేశాం.కొత్త కమిటీలు వేస్తాం. ఆన్‌లైన్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తాం. పార్టీలో యువ రక్తానికి అధిక ప్రాధాన్యం ఇస్తాం. వారిని ప్రోత్సహిస్తాం. నాపైన రెండు భాద్యతలు ఉన్నాయి. తెలంగాణలో పార్టీని బలోపేతం చేయడం, రాక్షస పాలనను అంతమొందించి రాష్ట్రంలో సుభిక్ష పాలన సాగాలని నన్ను గెలిపించిన ఏపీ ప్రజలకు న్యాయం చేయడం. ఇకపై తెలంగాణకు ప్రతి 15 రోజులకొకసారి వస్తా. మీ అందరి అభిప్రాయాలు తీసుకుంటా. అందరి నిర్ణయాల మేరకే పార్టీలో నిర్ణయాలుంటాయ ని చంద్రబాబు స్పష్టం చేశారు. టీడీపీలో యువతను ప్రోత్సహిస్తామని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. యువరక్తంతో పార్టీని బలోపేతం చేస్తామని చెప్పారు. ఇకపై ప్రతి 15 రోజులకు ఒకసారి హైదరాబాద్ వస్తానని, అందరి అభిప్రాయాలు తీసుకుంటానని తెలిపారు. కష్టపడినవారికే పార్టీలో ప్రాధాన్యత అని తేల్చి చెప్పారు. తెలుగుజాతి నెంబర్ వన్ గా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని చంద్రబాబు నాయుడు వెల్లడించారు.చంద్రబాబును కలిసిన బాబూమోహన్ : టీడీపీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును తెలంగాణ నేత, ప్రముఖ సినీ నటుడు బాబూమోహన్ కలిశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో మర్యాదపూర్వకంగా చంద్రబాబుతో భేటీ అయ్యారు. దీంతో ఆయన టీడీపీలో చేరబోతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు బీజేపీలో ఉన్న ఆయన ఆందోల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం జరిగిన పరిణామాల దృష్ట్యా భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేశారు. ఆ తర్వాత కే.ఏ పాల్ నేతృత్వంలోని ప్రజాశాంతి పార్టీలో చేరారు. ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. అయితే అనూహ్యంగా ఎన్టీఆర్ భవన్‌లో ఆయన దర్శనమివ్వడంతో టీడీపీలో చేరబోతున్నారనే వార్తలు వైరల్ అయ్యాయి. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరోవైపు తెలంగాణలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా చంద్రబాబు దూకుడు పెంచారు. ఈ క్రమంలోనే ఎన్టీఆర్ భవన్ వేదికగా ఆదివారం పార్టీ ముఖ్య నేతలతో సమావేశం అయ్యారు.

## జిహెచ్ఎంసి ఆఫీస్‌ను

# కూల్చేస్తారా?



(హైదరాబాద్):ఆగస్టు 25 ప్రజావినికిడి:

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ న గరంలో హైడ్రా కూల్చివేతలు సంచలనం రేకెస్తున్నాయి. హైడ్రా దూకుడుపై ఎంఐఎం అధినేత, ఎంపి అసదుద్దీన్ ఓవైసి స్పందించారు. ఎఫ్‌టిఎల్ పరిధిలో నిర్మించిన ప్రభుత్వ భవన సముదాయాలను కూడా కూల్చివేస్తారా? అని ఆయన ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్ దారుస్సలాంలో అసదుద్దీన్ విలేకరులతో మాట్లాడారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన భవనాలను కూల్చి వేస్తున్న అధికారులు ఆ పరిధిలో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలను కూడా కూల్చివేస్తారా అని నిలదీశారు. హుస్సేన్ సాగర్ వద్ద నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలను ఏం చేయబోతున్నారని, నెక్లెస్ రోడ్డు కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలోఉందని మరి దాన్ని కూడా తవ్వేస్తారా అని హైడ్రా అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) కార్యాలయం కూడా నీటి కుంటలో నిర్మించిందేని, మరి నాలా మీద కట్టిన జిహెచ్ఎంసి కార్యాలయాన్ని కూడా కూల్చేస్తారా అంటూ వాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో చాలా చోట్ల ప్రభుత్వ కార్యాలయాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని పేర్కొన్నారు. గోల్కొండలో ఉన్న చెరువులో గోల్ఫ్ కోర్టు ఉందని, ఆ గోల్ఫ్ కోర్టులో ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు కూడా గోల్ఫ్ ఆడుతారని గుర్తు చేశారు. ఒకసారి అక్కడికి వెళ్లి చూడండి, లేదంటే ఫోటోలు కావాలంటే తాను ఇస్తానన్నారు. ఎఫ్‌టీఎల్ సమస్యపై హైదరాబాద్ నగర మేయర్‌ను కలిసి చెప్పానని, ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూస్తానన ఆయన తెలిపారు.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వక్ఫ్ బోర్డుకు వ్యతిరేకంగా బిల్లును ప్రవేశ పెడుతోందని ఓవైసీ మండిపడ్డారు. ముస్లింలు లేకుండా చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని దుయ్యబట్టారు. మజీద్‌లు, దర్గాల లాగే వక్ఫ్ ఆస్తులు కూడా ప్రభుత్వ ఆస్తులు కావని, ఎప్పటి నుంచో ఉన్న వక్ఫ్ ఆస్తులకు డీడ్ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. మక్కా మసీద్‌కు డీడ్ కావాలంటే ఎక్కడ తేవాలని కేంద్ర ప్రభుత్వాన్ని అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. ముస్లింలను ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే బిజెపి చూస్తోందని ఆయనన్నారు. వక్ఫ్ బోర్డును విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారని, దేశ వ్యాప్తంగా ముస్లింలు బిజెపిపై ఆగ్రహంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డులో ఇద్దరు హిందూ మెంబర్లను పెట్టాలని ఎందుకు చెబుతున్నారు? అని ప్రశ్నించారు.వక్ఫ్‌ను ఖతం చేయాలని అనుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ముస్లింలు లేకుండా చేయాలనుకుంటున్నారని అన్నారు. సెక్షన్ 40లో తప్పులు జరిగి ఉంటే ఉదాహరణ చూపించమని ప్రధానిని డిమాండ్ చేశారు.కాశీ విశ్వనాథ్ టెంపుల్ మెంబర్ కావాలంటే కేవలం హిందూ మాత్రమే అని సెక్షన్లో ఉంది. మరి వక్ఫ్ బోర్డులో కేవలం ముస్లింలు ఎందుకు ఉండకూడదు?. వక్ఫ్ బోర్డులో ఇద్దరు హిందూ మెంబర్లను పెట్టాలని ఎందుకు చెబుతున్నారు. అన్ని రాష్ట్రాల్లో ఎండోన్మెంట్ మెంబర్ కావాలంటే కచ్చితంగా హిందూ అయ్యుండాలనే నిబంధన ఉంది. వక్ఫ్ బోర్డులో ఇద్దరు నాన్ ముస్లిం తప్పకుండా ఉండాలనడం వెనుక మతలబు ఏంటి?. దీనికి మోడీ సమాధానం చెప్పాలి' అని అసదుద్దీన్ అన్నారు.ం

# రూ. 175కోట్ల భారీ సైబర్ క్రైమ్



(హైదరాబాద్):ఆగస్టు 25 ప్రజావినికిడి:

హైదరాబాద్ కేం ద్రంగా భారీగా సైబర్ క్రైమ్ కుంభకోణం పాల్పడిన ట్లు ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. సైబర్ నేర గాళ్లకు సహకరించిన ఇద్దరు బ్యాంకు నుంచి రూ. 175 కోట్లు లావాదేవీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో. ఎన్‌సిఆర్ పి పోర్టల్‌లో డేటా విశ్లేషించగా పాతబస్తీలోని షం షీర్‌గంజ్ ఎస్‌బిఐ శాఖలోని ఆరు బ్యాంకు ఖాతాల ఫిర్యాదులను గుర్తించింది. ఈ ఖాతాల ద్వారా రెం డు నెలల స్వల్ప వ్యవధిలో పెద్ద మొత్తంలో డబ్బు లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఖాతాదారు లు పెద్ద ఎత్తున సైబర్ మోసాలకు పాల్పడి అవక తవకలకు పాల్పడినట్టు గుర్తించారు. ఈ ఖాతాలకు దాదాపు 600 ఫిర్యాదులు లింక్ గుర్తించారు. ప్రధాన నిందితుడు దుబాయ్ కేంద్రంగా పనిచేస్తు న్నట్లు గుర్తించారు. అతనికి చెందిన ఐదుగురు స హచరులు పేద ప్రజలను బ్యాంకు ఖాతాలు తెరి చేందుకు, సైబర్ నేరాలు, హవాలా కార్యకలాపా లకు కమీషన్ ప్రాతిపదికన ఉపయోగించుకున్నట్లు పోలీసులు గుర్తించారు.బ్యాంకు ఖాతాలు తెరవ డంలో అవసరమైన అన్ని పత్రాలను సిద్ధం చేయ డంలో మహమ్మద్ షోయబ్ తౌకీర్ అనే వ్యక్తి కీలక పాత్ర పోషించినట్లు సైబర్ క్రైమ్ పోలీసులు నిర్ధా రించారు. ఖాతాలు తెరిచిన తర్వాత, చెక్కులపై ఖా తాదారుల సంతకాలు చేయించాడు. ఆపై వాటిని సహచరులలో ఒకరి కస్టడీలో ఉంచారు. కొంత డబ్బును క్రిప్టో కరెన్సీ ద్వారా దుబాయ్‌కి పంపిం చారు. ప్రధాన నిందితుడి ఆదేశాలను అనుసరించి సహచరులు డబ్బును విత్ డ్రా చేశారు. షోయబ్ తోపాటు ఇతర సహచరులు కొంతమంది పేద వ్య క్తులను ఫిబ్రవరి 2024లో ఎస్‌బిఐ షంషీర్‌గంజ్ బ్రాంచ్‌లో ఆరు కరెంట్ ఖాతాలను తెరిచేందుకు ఒప్పించి, కమీషన్‌లతో ఆశ చూపించారు. ఈ ఏడా ది మార్చి, ఏప్రిల్ నెలలో, ఈ ఆరు ఖాతాలలో రూ. 175 కోట్లు లావాదేవీలు సైబర్ పోలీసులు గుర్తిం చారు. సైబర్ నేరగాల కోసం పనిచేసిన మహ్మద్ షోయబ్ తౌకీర్, మహ్మద్ బిన్ అహ్మద్ బవాజీర్ లను సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు అదుపు లోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఇలాంటి మో సాలపై ప్రజలు అప్రమత్తం గా ఉండాలని సూచిస్తు న్నారు పోలీసులు.వేరొకరి కోసం బ్యాంకు ఖాతా తెరవ వద్దని, అనుమానాస్పద లావాదేవీలలో పాల్గొనవద్దని హెచ్చరిస్తున్నారు. బ్యాంకు ఖాతాలను తెరవడానికి అయాచిత ఆఫర్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ఖాతాను తెరవమని, ఖాతా కార్యకలాపాన్ని క్రమం తప్పకుండా పర్యవేక్షించమని పోలీసులు సూచిస్తున్నారు. పెరిగిన టెక్నాలజీని ఆసరాగా చేసుకుని ఇటీవల సైబర్ క్రిమినల్స్ రెచ్చిపోతున్నారు. ఓటీపీ, లింక్ ల పేరుతో క్షణాల్లోనే కోట్ల రూపాయలు కొల్లగొడు తున్నారు. ఇలాంటి వాటిపట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు.

# హైడ్రా ప్రకంపనలు



## ఇప్పటిదాకా కూల్చివేసిన నిర్మాణాలపై తెలంగాణ ప్రభుత్వానికి 'హైడ్రా' నివేదిక

### అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేస్తున్న వైనం

### నిన్న నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేత

### ఇప్పటిదాకా 18 ప్రాంతాల్లో కూల్చివేతలు జరిపినట్లు నివేదిక

(హైదరాబాద్):ఆగస్టు 25 ప్రజావినికిడి:
హైడ్రా తీసుకున్న చర్యలు, కాపాడిన భూముల వివరాలతో కూడిన నివేదిక ప్రభుత్వానికి చేరింది. గత రెండు నెలల నుంచి చెరువుల్లో, పార్కుల్లో, ప్రభుత్వ భూముల్లో చేపట్టిన కూల్చివేతలు, కాపాడిన భూముల వివరాలను ఆ నివేదికలో వివరించారు.
ఆదివారంప్రభుత్వానికి హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ తన నివేదికను అందజేశారు. ఓఆర్ఆర్ పరిధిలోని 8 మునిసిపల్ కార్పొరేషన్‌లు, 20 మునిసిపాలిటీలు, 33 పంచాయతీల పరిధిలో వచ్చిన ఫిర్యాదుల మేరకు 18 చోట్ల కూల్చివేతలు జరిపినట్లు కమిషనర్ వెల్లడించారు. జూన్ 27 నుంచి ఈనెల 24 వరకు చేపట్టిన కూల్చివేతలకు సంబంధించిన వివరాలను నివేదికలో పొందుపరిచారు. కూల్చివేతలు చేపట్టిన 18 ప్రాంతాల్లోని కబ్జాల నుంచి 43.94 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఆ నివేదికలో తెలిపారు.

### అందరూ ప్రముఖులే, ఆక్రమ నిర్మాణాలే..

హైడ్రా తీసుకున్న చర్యల్లో ముఖ్యంగా చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లతో పాటు పార్కు స్థలాలను కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలు ఉన్నాయని, ఇందులో పలువురు రాజకీయ నేతలు, సినీనటులు, క్రీడాకారులు కూడా ఉన్నట్టు హైడ్రా నివేదికలో పేర్కొన్నారు. ఎన్‌ఓసిలు లేవు. అనుమతులు అంతకన్నా లేవు. కోర్టు కేసులు, క్రమబద్ధీకరణ లేకుండానే చెరువులను ఆక్రమించుకోవడం, నిర్మాణాలను చేపట్టడం ఈ చర్యలతో బహిర్గతమైనట్టు తెలిపినట్టు సమాచారం. వచ్చిన ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుని, సమగ్రంగా విచారణ చేపట్టిన అనంతరం చర్యలు తీసుకున్నట్టు ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన సందర్భంలో తెలియజేసినట్టు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. కొందరు కేసులని, అనుమతులు ఉన్నాయని, ఎన్‌ఓసిలు తీసుకున్నామని చెబుతూ వ్యవస్థలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నట్టు రంగనాథ్ తెలిపారనేది సమాచారం.

### కూల్చివేతలు, కాపాడిన భూములు..

చింతల్ చెరువులో బిఆర్ఎస్ పార్టీకి చెందిన స్థానిక నాయకుడు రత్నాకరం సాయిరాజు అక్రమంగా నిర్మించిన 54 నిర్మాణాలను నేలమట్టం చేసి 3 ఎకరాల 5 గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు ఆ నివేదికలో పొందుపరిచారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని నందగిరిహిల్స్ పార్కు స్థలంలో ఎంఎల్‌ఎ నాగేందర్ మద్దతుదారుడు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించి 18 గుంటల భూమిని కాపాడినట్టు వెల్లడించారు. ఎంఐఎం పార్టీకి చెందిన బహదూర్‌పురా ఎంఎల్‌ఎ మహ్మద్ ముబిన్, ఎంఎల్‌సి మిరాజ్ రెహ్మత్ బేగ్‌కు చెందిన రాజేంద్రనగర్ పరిధిలోని శివరాంపల్లి బూమ్‌రుఖ్ ఉద్ దౌలా చెరువులో అక్రమంగా నిర్మించిన ఐదంతస్థుల రెండు భవనాలను, ఒకటి రెండంతస్థుల భవనంతో పాటు మరో భవనాన్ని నేలమట్టం చేసినట్టు రంగనాథ్ తన నివేదికలో వివరించారు. ఈ చెరువు పరిధిలో మొత్తం 46 అక్రమ కట్టడాలను తొలగించడం ద్వారా 12 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనంలోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు.
గండిపేట్ జలాశయం ఎఫ్‌టిఎల్ పరిధిలోని చిలుకూరు, ఖానాపూర్‌లలో కాంగ్రెస్‌కు చెందిన కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు సోదరుడు పల్లం ఆనంద్, కావేరి సీడ్స్ యజమాని జివి భాస్కర్‌రావు, మంథని అసెంబ్లీ ఎంఎల్‌ఏగా పోటీ చేసిన సునీల్ రెడ్డి, ప్రో కబడ్డీ యజమాని అనుపమ అధికారికంగా అనుమతులు తీసుకోకుండా నిర్మించిన 8 భవనాలు, 14 తాత్కాలిక షెడ్లు, 4 ప్రహరీలను కూల్చివేసినట్టు తెలిపారు. ఈ చర్యలతో ఖానాపూర్, చిల్కూరు ప్రాంతంలో గండిపేట్ జలాశయం ఎఫ్‌టిఎల్ పరిధిలోని 16 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు హైడ్రా నివేదికలో వివరించారు.
మాదాపూర్ తమ్మిడికుంట చెరువులో అనుమతులు లేకుండా ఎఫ్‌టిఎల్ పరిధిలో సినీనటుడు నాగార్జున అక్రమంగా నిర్మించిన ఎన్‌కన్వెన్షన్‌లో రెండు నిర్మాణాలను కూల్చివేసి 4 ఎకరాల 9 గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఫిల్మ్‌నగర్ హౌసింగ్ సొసైటీకి చెందిన ప్రదేశంలోని పార్కు స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని తొలగించి 16 గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.
మన్సురాబాద్‌లో 2 గుంటలు, ఎంపి, ఎంఎల్‌ఎల కాలనీలో 6 గుంటలు, బంజారాహిల్స్ మిథిలానగర్‌లో ఎకరం 4 గుంటలు, ఫిల్మ్‌నగర్‌లోని బిజెఆర్ నగర్‌లో నాలాపై అక్రమంగా నిర్మించిన స్లాబ్‌ను కూల్చేసి 5 ఎకరాలు, గాజులరామారం మహదేవపురం వద్ద ఒక గుంట, గాజుల రామారం భూదేవిహిల్స్‌లో ఎకరం ఒక గుంట, అమీర్‌పేట్‌లో గుంట, చందానగర్ ఈర్ల చెరువులో అక్రమంగా నిర్మిస్తున్న మూడంతస్థుల భవనం ఒకటి, నాలుగు అంతస్థుల భవనాలు రెండు కూల్చేసి 16 గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తన నివేదికలో తెలిపారు. బాచుపల్లి ఎర్రకుంటలో 29 గుంటలు, బోడుప్పల్ రెవెన్యూ భూమిలో 3 గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు ఆ నివేదికలో వివరించారు.

# గ్రామాల్లో ఎన్నికల సందడి

(హైదరాబాద్):ఆగస్టు 25 ప్రజావినికిడి:
తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల కోసం ఓటర్ల జాబితా రూపకల్పనకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయడంతో గ్రామాల్లో ఎన్నికల వేడి మొదలైంది. ఓటరు జాబితాకు షెడ్యూల్ విడుదల చేయడంతో దసరా నాటికి ఎన్నికలు రావచ్చనే అంచనాలతో ఆశావాహులు సందడి చేస్తున్నారు. బూత్‌ల వారీగా పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. ఇక రిజర్వేషన్ల హడావుడి అయితే కొనసాగుతూనే ఉంది. గత ఎన్నికల్లో అవలంభించిన రిజర్వేషన్లే ఈసారి కూడా అమలు జరుగుతాయని తెలుస్తోంది. బిసి కులగణన చేపట్టిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నా, దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మంత్రుల స్థాయిలోనే ఏదో ఒక స్టేట్‌మెంట్ ఇస్తున్నారు తప్ప స్పష్టత లేదు. ప్రస్తుతం ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లు ఎలా ఉండబోతున్నాయనే దానిపై ప్రజల్లో చర్చ కొనసాగుతోంది. ఎన్నికల సంఘం సెప్టెంబరు 6న గ్రామపంచాయతీల ఎన్నికలకు సంబంధించి ఓటరు ముసాయిదా జాబితాను జారీ చేయనుంది.
దీనిపై 7వ తేదీ నుంచి 13 వరకు డీపీవోలు, ఎంపీడీవోలు, అభ్యంతరాలను స్వీకరిస్తారు. 19వ తేది లోగా అభ్యంతరాలను పరిష్కరించి 21న వార్డుల వారీగా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. దీంతో పాటు ఎన్నికల కమిషన్ అధికారులతో క్షేత్రస్థాయిలో సమావేశాలు కూడా నిర్వహిస్తోంది. ఈ నెల 29న రాష్ట్ర ఎన్నికల కమిషన్ జిల్లా కలెక్టర్లతో కాన్ఫరెన్స్ కూడా నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల జాబితాపై సెప్టెంబరు 9, 10 తేదీల్లో రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులతో జిల్లా, మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఎన్నికల సంఘం 200 మంది ఓటర్లతో ఉండే విధంగా బూత్‌లను ఏర్పాటు చేయడం, బూత్‌లో ఒక ప్రీసైడింగ్ అధికారి, పోలింగ్ అధికారి, 201 నుంచి 400 మంది ఓటర్లు ఉన్న బూత్‌లో ఒక ప్రీసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 600 మంది ఓటర్లు ఉండే పోలింగ్ బూత్‌లో ఒక ప్రీసైడింగ్ అధికారితోపాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించే విధంగా ఎన్నికల సంఘం సిబ్బంది నియామకాన్ని చేపట్టనుందని తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణకు అధికారిక నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత సిబ్బంది నియామకం, బూత్‌ల స్థాయిలో ఓటర్ల వివరాలను ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశం ఉంది.




గత పంచాయతీ ఎన్నికలు 2019లో జరిగాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 12751 గ్రామ పంచాయతీలు ఉండగా 12,732 పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు నోటిఫై చేసింది. అలాగే ఈ పంచాయతీల్లో 1,13,354 వార్డులు ఉంటే వాటిలో 1,13,152 వార్డులకు ఎన్నికలు జరిపేందుకు ఎన్నికల సంఘం నోటిఫై చేసింది. అప్పట్లో వీటిలో 24 సర్పంచ్ ఎన్నికకు, 492 వార్డు ఎన్నికలకు నామినేషన్లు దాఖలు కాలేదు. కాగా 2134 సర్పంచ్ పదవులు ఏకగ్రీవం అయ్యాయి. వార్డు సభ్యుల పదవులు 29,985 కూడా ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 10,571 సర్పంచ్ పదవులకు, 82,675 వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఈ లెక్కన 2024లో జరుగబోయే ఎన్నికల్లో ఎన్ని సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఏకగ్రీవం అవుతాయి, ఎన్నికలు జరుగుతాయో చూడాల్సి ఉంది.

ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో ఎవరిని నిలబెట్టాలి, ఎవరిని ఏకగ్రీవం చేయాలనే అంశంపై మంతనాలు సాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వాల కారణంగా ఏకగ్రీవం చేసే పంచాయతీలే ఎక్కువ ఉంటాయని భావిస్తున్నారు. కొన్ని చోట్ల పోటీ అనివార్యమైతే ముక్కోణపు పోటీ తప్పదని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అలాగే 2018 మే 17 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఓటర్ల సంఖ్య 1,37,17,469 ఉండగా, వీటిలో పురుష ఓటర్లు 68,50,309 ఉండగా, మహిళా ఓటర్ల సంఖ్య 68,66,300 మంది, ఇతరులు 860 మంది ఉన్నారు. గత ఎన్నికల్లో 96,029 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. 2024లో జరిగే ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యతో పాటు పోలింగ్ స్టేషన్లు కూడా గణనీయంగా పెరుగుయని భావిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 21న తుది ఓటర్ల జాబితా ప్రకటించడంతో ఎన్నికల నిర్వహణకు తొలి అడుగు పడుతుంది.

# ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

### రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులతో మంత్రి పొంగులేటి




(హైదరాబాద్):ఆగస్టు 25 ప్రజావినికిడి:
స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో అవినీతికి తావివ్వొద్దని, రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజల నుంచి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా సేవలందించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.
నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లకుండా పనిచేయాలని చెప్పారు.
ఆదివారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో రాష్ట్రంలోని రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు, జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.
ఇటీవల బదిలీలు జరిగిన విషయం గుర్తుచేస్తూ.. సబ్ రిజిస్ట్రార్ల నుంచి ఉన్నతస్థాయి వరకు అధికారులందరూ వీలైనంత త్వరగా కొత్త స్థానాల్లో సర్దుబాటు కావాలని పొంగులేటి చెప్పారు. బాగా పని చేసిన వారికి పదోన్నతులు కల్పిస్తామని, బదిలీల్లో ప్రాధాన్యత కల్పిస్తామని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ఉద్యోగులు నిజాయితీ, అంకిత భావంతో పనిచేయాలని కోరారు.వచ్చే ఐదేళ్లలోగా రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మిస్తున్నామని, దశల వారీగా నిర్మాణాలు చేపట్టి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ప్రస్తుతమున్న భవనాలకు అద్దెలు, విద్యుత్, వాటర్ చార్జీలు, వాహనాల అద్దె లాంటి బకాయిలను త్వరలోనే విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు.
ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ల విషయంలో అవలంబిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని మంత్రి సూచించారు. భూముల విలువల సవరణ ప్రక్రియ విషయంలో థర్డ్ పార్టీ నివేదిక వచ్చిన తర్వాత త్వరలోనే మరోసారి సమావేశం ఏర్పాటు చేస్తానని చెప్పారు.
కాగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఐజీ బుద్ధ ప్రకాశ్‌జ్యోతి శాఖ పనితీరు గురించి మంత్రికి వివరించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వార్షిక నివేదికను మంత్రి పొంగులేటి విడుదల చేశారు. సమావేశంలో అదనపు ఐజీలు, డీఐజీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# హైడ్రా కూల్చివేతలు రంగారెడ్డి,మేడ్చల్, నాగోల్, ఎల్బీనగర్ లో కూడా జరగాలి..

**సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షులు టీపీసీసీ రాష్ట్ర ఆదివాసీ గిరిజన వైస్ చైర్మన్ గాంధీ నాయక్..**



(హైదరాబాద్):ఆగస్టు 25 ప్రజావినికిడి: హైదరాబాద్ తరహా బఫర్ జోన్లో అక్రమ నిర్మాణాలు చేపట్టిన ఆస్పత్రులు ఫంక్షన్ హాల్స్ అపార్ట్మెంట్లు ఇండ్లు అక్రమ కట్టడాలను హైదరాబాద్ రంగారెడ్డి మేడ్చల్ నాగోల్ ఎల్బీనగర్ లో సైతం హైడ్రా కూల్చి వేయాలని సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షులు,టీపీసీసీ రాష్ట్ర ఆదివాసి గిరిజన వైస్ చైర్మన్ గాంధీ నాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గాంధీ నాయక్ మాట్లాడుతూ,బఫర్ జోన్, ఎఫ్ టి ఎల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్ )లో భూములు ఆక్రమించుకున్న వారి కట్టడాలను కూల్చివేయాలని కోరారు. ప్రభుత్వ భూములు కాపాడాలని అక్రమ నిర్మాణం చేపట్టిన ఆస్తులను ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకోవాలని చట్ట ప్రకారం ముందుకు వెళుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా అభినందనలు తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు. బఫర్ జోన్,ఎఫ్ టి ఎల్ భూముల్లో అక్రమ నిర్మాణాలు సిటీ లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించాలని, గతంలో కొంతమంది ప్రభుత్వ అధికారులు అనుమతులు ఇచ్చారని అలాంటి అధికారులపై సైతం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిటీ ప్రాంతంలో మునిసిపాలిటీలో బఫర్ జోన్లలో నిర్మాణాలు చేసిన వివరాలను సేకరించి త్వరలో జిల్లా కలెక్టర్ కు,రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సేవాలాల్ బంజారా సంఘం ఫిర్యాదు అందజేస్తుందని గాంధీ నాయక్ అన్నారు. ముక్కుసూటిగా ప్రజాపాలన చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదలు, పెద్దలు అని చూడకుండా అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు హైడ్రాకు అధికారం ఇవ్వడం అక్కడ నిజాయితీగల అధికారి రంగనాథ్ ని నియమించడం అభినందనీయమని నాగార్జున అని కానీ కేటీఆర్ అని కానీ మాజీ తెరాస ప్రజాప్రతినిధులను అని కానీ పల్లా రాజేశ్వర్ రెడ్డి అని కానీ చూడకుండా హైడ్రా అధికారులు తెల్లవారుజామునే కూల్చివేతలకు పాల్పడడం చెరువులను కాపాడడం అభినందనీయమని టీపీసీసి రాష్ట్ర ఆదివాసీ గిరిజన వైస్ చైర్మన్ కే.గాంధీ నాయక్ అన్నారు.

# పక్షవాత బాధిత బిడ్డ పెళ్లి కి ఉప్పల ఫౌండేషన్ చేయూత..

**అన్ని వర్గాల ప్రజలకు అన్ని విధాలా ఆదుకుంటూ ఆపద్బాంధవుడిగా ఆడబిడ్డల వివాహానికి అండగా నిలుస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్త..**



**ప్రజావినికిడి,(నాగోల్):**ఆదివారం రోజు హైదరాబాద్ లోని నాగోల్ లో ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంపు కార్యాలయంలో సికింద్రాబాద్ సీతా ఫాల్ మండి కి చెందిన పక్ష వాతంతో బాధపడుతున్న మల్లమ్మ రాజయ్య కుమార్తె బబితా (ఎస్సి సామాజిక వర్గం) వివాహానికి పూస్తె మట్టెలు చీర,గాజులు ను టిపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అందజేయడం జరిగింది. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ,ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక పేద కుటుంబాలకు చెందిన వారికి పూస్తె మట్టెలు చీర గాజులు అందజేయడం జరుగుతుంది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గంగం శంకర్ మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ ఫ్రెండ్లీ ఎన్విరాన్మెంట్ డిసేబుల్ చైర్మెన్ గంగారాం,నాగభూషణం,కృష్ణ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

# బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఫేస్1లో నూతన వేవ్ సెలూన్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా బి.యన్ రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి..హాజరు..





ప్రజావినికిడి,(ఎల్బీనగర్):ఆదివారం రోజు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బి.యన్.రెడ్డి నగర్ ఫేస్ 1లో నూతన వేవ్ సెలూన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో యజమాని యశ్వంత్ రెడ్డి, పార్టీ నాయకులు రఘురాం నేత,శ్రీధర్ రావు మరియు తదితరులు పాల్గొన్నారు.

# కలకత్తా మహిళా డాక్టర్ అత్యాచారం హత్యకు నిరసనగా ప్రగతి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ...




ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
కలకత్తా మహిళా డాక్టరు అయిన డా.మౌమితదేభ్నాధ్ పైజరిగిన అత్యాచారం హత్య కు నిరసన తెలుపుతూ ప్రగతినగర్ వాసవీకాలనీలో ప్రగతి సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. ర్యాలీలో 22వ వార్డు కార్పొరేటర్ పైడి,మాధవి,ప్రగతి సినియర్సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్, యం.మల్లేష్,వైస్ ప్రెసిడెంట్ టి.కోటేశ్వర రావు,జనరల్ సెక్రటరీ.రాజేశ్వర రావు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు. కాలనీ లోని రాధాకృష్ణ పార్కు నుండి జగన్ స్టూడియో సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న కార్పొరేటర్, 23 వ వార్డు సోషల్ సర్వీస్ మెంబరు మంజరి,కాలనీ ప్రజలు మహిళలు,యువకులు, మరియు సీనియర్ సిటిజన్ భ్యులు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

# స్నేహపురి కాలనీలో పర్యటించిన స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ ..



ప్రజావినికిడి,(కొత్తపేట):ఆదివారం రోజు కాలనీలో సమస్యలు తెలుసుకునేందుకు స్నేహపురి కాలనీలో పర్యటించిన స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ ఆదివారంరోజు కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీ స్థానికులతో కలిసి కాలనీలో పర్యటించిన స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ కాలనీలో వర్షపు నీటి సమస్య ఎక్కువగా ఉందని వర్షం వచ్చిన ప్రతి సారి నీరు వెళ్లేందుకు నాళాలు లేకపోవడంతో రోడ్డు అంత నిండిపోతున్నాయి తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పవన్ కుమార్ ని కోరారు. వారు సమస్యను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే కాలనీలో డ్రైనేజీ సమస్య కూడా ఎక్కువగా ఉందని తెలియజేయడంతో జలమండలి అధికారులతో మాట్లాడటం జరిగింది. కాలనీలో డ్రైనేజీ సమస్య లేకుండా చూడాలని వెంటనే డ్రైనేజ్ లైన్ అంత శుభ్రం చేయాలని కోరారు. విది కుక్కల బెడద కూడ ఎక్కువగా వుండటంతో చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాలనీలో సానిటైజేషన్ ఇబ్బందులు కూడా వున్నాయని కాలనీ వాసులు తెలియజేయడంతో వెంటనే ఎస్ఎఫ్ఎ సూపర్వైజర్ తో మాట్లాడి రోడ్లపైన చెత్తలేకుండా శుభ్రం చేసెల చూడాలని లేనిచో వర్షాకాలంలో దోమలు ఎక్కువగా పెరిగి అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలియజేశారు. అనంతరం కాలనీలో వున్న వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో కాలనీ వాసులు మహేందర్, వెంకట్ రావు, తిరుమల్ రెడ్డి, రవీందర్ బాబు, భాస్కర్ రావు, యాదగిరి,శాంత మూర్తి,తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన క్రెడాయ్ ప్రాపర్టీ షో






ప్రజావినికిడి,(నాగోల్): కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) ప్రాపర్టీ షో ను నాగోల్ మెట్రో స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసింది. ఈ ప్రాపర్టీ షోను ముఖ్య అతిథులుగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు,ఎంపీ ఈటల రాజేందర్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ స్కిల్ కాపిటల్ గా మార్చాలనేది ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఐటీరంగం, రియల్ ఎస్టేట్ రంగం రోజురోజుకు విస్తరిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ రంగాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ఈ ప్రాపర్టీ షోను ప్రతి ఒక్కరువినియోగించుకోవాలని సూచించారు. అనంతరం క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వి.రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రెడాయ్ సభ్యులతో సమావేశమై రాష్ట్రానికి స్ఫూర్తినిచ్చిన 2050 విజన్‌ను ఆవిష్కరించడం ద్వారా రాబోయే రోజుల్లో గొప్పఅభివృద్ధిని అందుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కస్టమర్లకు విశ్వసనీయతమైన సేవలు అందించడమే క్రెడాయ్ లక్ష్యమని తెలిపారు. ఈ షో మూడు రోజులు జరిగిందని తెలిపారు.

# ఎస్ఎల్ఎన్ ప్రాపర్టీస్ ఐదవ వార్షికోత్సవం లో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి ఎస్ఎల్ఎన్ ప్రాపర్టీస్ వారి ఐదోవ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని చైర్మన్ కిరణ్మయి, డైరెక్టర్ జాలిగం రాకేష్ కు శుభాకాంక్షలు తెలిపిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ రేణుక ఎల్లమ్మ విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి




ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125డివిజన్ పరిధి గాజులరామారంలో శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ రేణుకు ఎల్లమ్మ విగ్రహాల పున:ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ:సంతోషాలతో ఉండాలని కోరిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏవీ రంగనాథ్ నీ కలిసిన తూము వినయ్ కుమార్..



ప్రజావినికిడి,(కూకట్ పల్లి):
హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ని ఆదివారం ఉదయం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి,పూల మొక్కని అందించి వారు నిర్వహిస్తున్న కార్యక్రమాలను కొనియాడుతూ, శుభాకాంక్షలు అభినందనలు తెలియజేస్తూ వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ,కూకట్ పల్లి నియోజకవర్గం లోనీ పలు చెరువులను కూడా సందర్శించి అందులో నిర్వహించిన అక్రమ కట్టడాలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఓబిసి వర్కింగ్ చైర్మన్ తూము వినయ్ కుమార్ ఏవి రంగనాథ్ ని కోరడం జరిగింది.

# అమ్మవారికి బోనాలు సమర్పించిన రాజేందర్ దంపతులు



ప్రజావినికిడి,(బైరామల్ గూడ):బైరామల్ గూడ పరిధి లోని శ్రీ రేణుక ఎల్లమ్మ, కట్ట మైసమ్మ దేవాలయంలో ఆదివారం నాడు బోనాల జాతర ఎంతో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రాజేందర్ దంపతులు ఆలయానికి విచ్చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆ అమ్మవారి దయవల్ల ప్రజలందరూ బాగుండాలని కోరారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక






# వైద్య విద్యార్థులకు రక్షణ ఏది?


మొన్న నిర్భయ, నిన్న దిశ, నేడు కోల్‌కతా ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం... ఇలా దేశంలో ప్రతి 16 నిమిషాలకు ఒక మహిళపై లైంగిక దాడి జరుగుతుంది. దేశంలో మహిళల భద్రత, సంక్షేమం కరువైంది. ఆడపిల్లలపై అమానుష అత్యాచార ఘటనలు నిత్యకృత్యమైనా యి. ఆగస్టు 9వ తేదీ రాత్రి కోల్‌కతా లోని ఆర్‌జీ కర్ బోధన ఆస్పత్రిలో 31 సంవత్సరాల పీజీ డాక్టర్‌పై దారుణంగా లైంగిక దాడి చేసి క్రూరంగా హత్య చేశారు. దీంతో మరోసారి దేశమంతా నిరసన జ్వాలలు చెలరేగాయి. సాధారణంగా రాత్రిపూట అమ్మాయిలు తిరగడం వలన, రెచ్చగొట్టే దుస్తులు ధరించడం వల్ల అత్యాచారాలు జరుగుతున్నాయని అమ్మాయిలను తప్పు పట్టే ఘటనలు లేకపోలేదు. కానీ ఈ పీజీ డాక్టర్ నైట్ డ్యూటీలో ఉండగా జనాలతో కిటకిటలాడే ఆసు పత్రిలో, సెమినార్ రూంలో విశ్రాంతి తీసుకుంటుండగా, రాత్రి 2 గంటల తర్వాత కాళ్లు చేతులు విరిచి, గోళ్లతో రక్కి, మెడ ఎముక విరిచి, తల నుండి పాదాల వరకు రకరకాలుగా గాయపరిచి దారుణాతి దారుణంగా చంపేశారంటే దేశంలో మహిళల భద్రత ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. మహిళలు, అర్ధరాత్రి కాదు కదా., పట్ట పగలు నడిచే పరిస్థితులు కూడా కష్టమే. నడిచే వాహనాలలో, గాలిలో ఎగిరే విమానాలలో, పనిచేసే చోట, ఇంటా బయటా అన్నిచోట్ల లైంగిక వేధింపులు విపరీతమవుతున్నాయి. మహిళల రక్షణ భద్రత సంక్షేమం కోసం అనేక చట్టాలు తయారు చేయడం జరిగింది. కానీ వాటి అమలులో చిత్తశుద్ధి లోపించడం, అందులో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని శిక్షల నుండి తప్పించుకోవడం, మితిమీరిన రాజకీయ జోక్యంతో బయటపడడం జరుగుతోంది. పాలక ప్రజాప్రతినిధులు సైతం ఈ దారుణాలకు పాల్పడుతుండడం బాధాకరం. గుజరాత్‌లో జరిగిన బిల్కిస్ భాను ఉదంతం, భారత రెజ్లర్లపై పాలక పార్టీ ప్రజా ప్రతినిధి లైంగిక దాడులకు పాల్పడినట్లు నెలల తరబడి ఆ క్రీడాకారులు రోడ్లపైకి వచ్చి ఉద్యమించడం లాంటి ఘటనలు కోకొల్లలు. మహిళా వైద్యురాలిపై అమానుష హత్యాకాండ జరగడం ఒకటైతే. ఈ ఘోర కృత్యాన్ని దాచిపెట్టే ప్రయత్నాలు జరగడం, తండ్రి లాంటి వాడిని అని చిలక పలుకులు పలుకుతున్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఆమె ఆత్మహత్య చేసుకున్నదని, ఆమె సెమినార్ రూంకు ఎందుకు వెళ్లవలసి వచ్చిందని మాట్లాడటం.. నేరస్తులకు సహకరించే ప్రయత్నం లాగా కనిపిస్తుంది. ఈ సంఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగడంతో, ఆ ప్రిన్సిపాల్‌ను రాజీనామా చేయించి, మరింత మంచి హోదాలో నియమించారంటే అతగాడికున్న రాజకీయ మద్దతును అర్థం చేసుకోవచ్చు. బాధిత తల్లిదండ్రులకు కొన్ని గంటల పాటు తమ కుమార్తె శవాన్ని చూడనీయకుండా, ఎటువంటి నిరసన కార్యక్రమాలను తెలియజేయకుండా ఉండడానికి డబ్బులు ఎరవేస్తూ పోలీసులు ప్రతిపాదనలు చేశారని వార్తలు. అంటే ఈ సంఘటన వెనుక ఏదో పెద్ద చీకటి కోణం దాగి ఉన్నట్లుగా తెలుస్తుంది. అయితే కేసు విచారణను హైకోర్టు సీబీఐకి అప్పగించడం కోసమెరుపు. ఒక డాక్టర్ తయారు కావడం అంతా ఆషామాషీ కాదు. ఎన్నో సంవత్సరాలు కష్టపడి చదివి ఎంట్రెన్స్‌లలో విజయం సాధించి సీట్ సంపాదించి కఠినమైన విషయాల పట్ల అవగాహన పెంచుకుని పగలనకా రాత్రనకా రేయింబవళ్లు విధులు సేవలు అందించేవారు డాక్టర్లు. నైట్ డ్యూటీ అంటే సాధారణంగా రాత్రిపూట మాత్రమే అనుకుంటాం, కానీ వైద్య విద్యార్థులకు అది 36 గంటల డ్యూటీ. ఆ డ్యూటీలో కనీసం వారికి తినడానికి తీరిక కూడా ఉండదంటే అతిశయోక్తి కాదు. అలాంటి డ్యూటీలు వారానికి కనీసం మూడు చేయాల్సిందే. వాళ్లకు పండుగలు, ఫంక్షన్లు విందులు, వినోదాలు అచ్చట ముచ్చట ఏమీ ఉండవు. వారానికి కనీసం ఒక వారాంతపు సెలవు కూడా ఉండదు. ఇది కోర్సు చదువుతున్న వైద్య విద్యార్థుల ప్రస్తుత పరిస్థితి. ఇలాంటి తరుణంలో వారిపై ఒత్తిడి ఎలా ఉంటుంది? వారి మానసిక పరిస్థితి ఏమిటి? అనేది అర్థం చేసుకోవాలి. విధులు నిర్వర్తించే క్రమంలో పేషంట్లతో పాట్లు, ఒకవేళ పేషంట్ సీరియస్ కండిషన్లో ఉంటే వారి బంధువులైన అటెండర్‌లతో తంటాలు, తగువులు, తన్నులు పడాల్సిందే.. ఇలాంటి బాధలు అనుభవిస్తున్న జూనియర్ డాక్టర్లకు రక్షణ, సంక్షేమం కోసం కళాశాల అధిపతులు, యాజమాన్యాలు, ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వారు సేద తీరుదామంటే తగిన విశ్రాంతి గదులు, టాయిలెట్ సౌకర్యాలు, టీ, టిఫిన్, భోజన వసతు లు ఏవి కూడా సరిగా ఉండవు. శుచి, శుభ్రత, ఆరోగ్యంగా ఉండడానికి సలహాలు ఇచ్చే డాక్టర్లకు అవి కరువు అవడం ఆశ్చర్యకరమైన విషయం. చాలామంది ఇవి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతుండడం డిప్రెషన్‌లోకి వెళ్లడం లాంటి మానసిక సమస్యలతో డాక్టర్లు సతమతం అవుతున్నారు. ఇలా వైద్య విద్యార్థులు విపరీతమైన ఒత్తిడితో మానసిక సమస్యల బారిన పడుతున్నారని సాక్షాత్తు జాతీయ మెడికల్ కమిషన్ నివేదిక తెలుపుతుంది. ప్రతి నలుగురు ఎంబీబీఎస్ విద్యా ర్థుల్లో ఒకరు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రతి ముగ్గురి పీజీ విద్యార్థుల్లో ఒకరిలో ఆత్మ హత్య ఆలోచనలు కూడా వచ్చాయని తెలిపింది. ఈ విధంగా వారు మానసికంగా ఒత్తిడికి గురవుతున్న నేపథ్యంలో రెసిడెంట్ డాక్టర్లు వారానికి 74 గంటలకంటే ఎక్కువ పనిచేయవద్దని, వారానికి ఒకరోజు కచ్చితంగా సెలవు తీసుకోవాలని, వైద్య విద్యార్థులు సెలవు అడిగినప్పుడు తిరస్కరించకుండా మంజూరు చేయాలని జాతీయ మెడికల్ కమిషన్ పలు సూచనలు చేసింది. వీటిని చిత్తశుద్ధితో అమలుపరచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నది. ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులపై వైద్య సిబ్బందిపై హింసకు వ్యతిరేకంగా సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ తేవాలని పలువురు డాక్టర్లు డాక్టర్ల సంఘాలు డిమాండ్ చేస్తున్నట్లు, ఆ చట్టాన్ని తీసుకువచ్చి మెడికల్ కాలేజీలలో మహిళా డాక్టర్లు సిబ్బందికి భద్రత కల్పించాలి. అత్యాచారాలకు పాల్పడుతున్న నయా కీచ కులను, మానవ మృగాలను తక్షణమే శిక్షించాలి. భారతదేశం ప్రగతి పథంలో పయనించాలంటే స్త్రీల భాగస్వామ్యం అవసరం. అది సాధ్యం కావాలంటే సురక్షితంగా పని ప్రదేశం నుండి ఇంటికి వెళ్లగలగాలి. ప్రతి స్త్రీకి భద్రత గౌరవం అవసరం. అదే విధంగా మహిళా వైద్యులకు, సిబ్బందికి రక్షణ కల్పించాలి. ఆస్పత్రుల్లో భద్రత కోసం జూనియర్ డాక్టర్లు చేస్తున్న పోరాటానికి ప్రజలు మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, పౌరసమాజం, రాజకీయ పార్టీలు స్పందించాలి, మద్దతు ఇవ్వాలి. ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నప్పుడు మాత్రమే దేశానికి తలంపు తెచ్చే ఇలాంటి అత్యాచారాలకు అడ్డుకట్ట వేయడానికి సాధ్యమవుతుంది.

# కెమెరాకే ట్రిక్కులు నేర్పిన రాజన్



అద్భుతమైన జ్ఞాపకాలు, తియ్యటి అనుభూతులు, మధుర ఘట్టాలు, గొప్ప సన్నివేశాలు, అపురూప సంఘటనలు, మనసు దోచే దృశ్యాలు, ఆలోచింప జేసే రూపాలు... అరుదైన చిత్రాలు...వెరసి ఫొటోగ్రఫీ. వెలకట్టలేని దృశ్యాలను పదికాలాల పాటు పదిలంగా మన కళ్ల ముందు ఉంచేది ఫొటో. వంద మాటలతో చెప్పలేనిది ఒక్క ఫొటోతో చెప్పడం సాధ్యం. అంతటి శక్తివంతమైనది ఫొటోగ్రఫీ. అలాంటి శక్తిని వశం చేసుకుని ఫొటోతో అద్భుతాలు సృష్టించిన కెమెరా మాంత్రికుడు బండి రాజన్ బాబు. కెమెరాకే ట్రిక్కులు నేర్పిన నేర్పరి రాజన్ బాబు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన రాజన్ బాబు తెలంగాణకు చెందిన వారు కావడం గర్వకారణం. బండి రాజన్ బాబు (ఫిబ్రవరి 9, 1939 – ఆగష్టు 24, 2011) ప్రఖ్యాత ఛాయా చిత్రకారులు. దృశ్య ప్రధానమైన ఛాయా గ్రహణంలో పేరు తెచ్చుకొన్న బండి రాజన్ బాబు 1939, ఫిబ్రవరి 9 న కరీంనగర్ జిల్లా కోరుట్లలో జన్మించారు. రాజన్ బాబంటే తొలుత గుర్తుకు వచ్చేవి అరకు లోయల్లో తీసిన బొండా గిరిజన మహిళల అగణిత ఛాయా చిత్రాలు. బాల్యంలో రంగులు వేయడం, చిత్రాలను గీయడం పట్ల ఆసక్తిని కనబరిచిన రాజన్ బాబు, మంచి చిత్రకారుడు కావల్సి ఉండగా, కుంచె నుండి కెమేరాకు మారడం యాదృచ్ఛికం. బాల్యం నుంచి చిత్రకళ పై మక్కువ ఉన్న రాజన్, 7వ తరగతి చదువు తున్నప్పుడు తన కజిన్ బహుకరించిన సాధారణ కొడాక్ 620 కెమేరాతో తీసిన చిత్రాలు పెక్కుమంది ప్రశంసలు అందుకొని రాజన్ లోని ఛాయాగ్రాహకుడిని వెలికి తీసింది. హైదరాబాదులోని జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో కమర్షియల్ ఆర్ట్ (వ్యాపార చిత్రకళ) లో డిప్లొమా కోర్స్ లో చేరిన సమయంలో, రాజన్ బాబు ప్రఖ్యాత ఛాయాగ్రహకుడు దివంగత రాజా త్రయంబక్ రాజా బహదూర్ ను కలవటం జరిగింది. రాజా త్రయంబక్ రాజా, రాజన్ బాబును కుంచె స్థానంలో కెమేరా పట్టుకోమన్న సలహా రాజన్ జీవితాన్ని మలుపు తిప్పింది. 5 సంవత్సరాల డిప్లొమా చేసి, కళాశాలలో డిస్టింక్షన్ లో ఉత్తీర్ణుడయి, కళాశాల యాజమాన్యం మెప్పు పొంది అదే కళాశాలలో అధ్యాపకుడిగా చేరాడు. తరువాత ఇక్రిశాట్ లో సైంటిఫిక్ ఫొటొగ్రాఫర్ గా పనిచేశారు. 1978 లో తన ఫొటో స్టుడియో స్థాపించి, రాజన్ స్కూల్ ఆఫ్ ఫోటోగ్రఫీ ప్రారంభించి ఎందరో విద్యార్థులను నిపుణులైన ఛాయా గ్రహకులుగా తీర్చిదిద్దాడు. ఛాయాగ్రహణంలో రాజన్ తొక్కిన కొత్త పుంతలు తనకు దేశీయ, అంతర్జాతీయ గుర్తింపు తెచ్చింది. 1987లో నగ్న చిత్రాలపై ఛాయాచిత్ర కళాకృతులను సమర్పించి రాయల్ ఫోటోగ్రఫీ సొసైటీ ఫెలోషిప్ పొందాడు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ అకాడెమీ ఆఫ్ ఫోటోగ్రఫీ కార్యదర్శిగా ఉంటూ, భగవాన్ దాస్ తర్వాత లెన్స్ లైట్ అనే ఛాయాగ్రాహక పత్రికకు సంపాదకత్వం వహించారు. డిజిటల్ ఛాయాగ్రహణానికి ముందు ఛాయాచిత్రాలు డార్క్‌రూం (చీకటి గది) లోనే స్థిర రూపం దాల్చేవి. నెగటివ్ లు వృద్ధి చేయటానికి, స్థిరపరచడానికై రాజన్ తానే రూపొందించుకొన్న రసాయనిక సూత్రం పై ద్రవణాలు కలిపి డెవలపర్ తయారు చేసి, నెగటివ్ లను స్థిరపరిచేవారు. ఈ విధానంలో...చిత్రంలో, నలుపు, తెలుపులను ప్రస్ఫుటంగా చూపే హైడ్రోక్వినాన్ లేకుండా కేవలం మెటల్ తోనే ఫిల్మ్ ను వృద్ధిపరచి, స్థిరపరచి, నలుపు తెలుపులో ఎన్నో కళాఖండాలు సృష్టించారు. ఇది రాజన్ ప్రతిభకు నిదర్శనం. ఫొటొషాప్ లాంటి సాఫ్ట్వేర్లు లేని సమయంలో కూడా రాజన్ అద్భుతాలు చేశారు. తన కళా నైపుణ్యంతో తన ఛాయా చిత్రాలను పలు మార్లు వన్ మాన్ షో లో ప్రదర్శించి, పలువురి ప్రశంసలందుకున్నరు. రాజన్ తీసిన నగ్న చిత్రాలలో రసికత ఉంటుంది కాని అసభ్యతకు చోటు ఉండదు. అందుకే అవి రసజ్ఞుల ప్రశంసలు పొందాయి. కొడాక్ 620 తో మొదలుపెట్టిన రాజన్, తన విద్యార్థులకు ఛాయా గ్రహణ పాఠాలలో భాగంగా బోధించ టానికై, చాలా కెమేరాలు సేకరించారు. వాటిలో ఛాయాచిత్ర కారులలో హోదాకు చిహ్నమైన ఝుంంవశ్రీఎశ్రీఖుం- ఎవసఱబఎ-టశీతీఝ్ ఝఎవతీఖ కూడా ఉంది. ఫిల్మ్ కెమేరా ాాయిష్ట్రఱ ావత్ఖుఇ నుంచి, ఛాయాగ్రహణం డిజిటల్ దిశగా సాగిన పయనంలో రాజన్ ఝుఅశీఱ 400ఱ వాడే వాతు. ఛాయాగ్రహణ శాఖలలో ఒకటైన ఇండస్ట్రియల్ ఫోటోగ్రఫీలో కూడా రాజన్ తన సత్తా చూపారు. నగ్న చిత్రాలకు, అసభ్య చిత్రాలకు మధ్య ఒక గీత ఉంటుంది అనేవారు రాజన్ బాబు. ఛాయాగ్రహణం ఒక భాషైతే, అందులోని వ్యాకరణమే జశీఎజూశీంఙఅశీఱ, జశీశ్రీశీతీ, ాఋఝుఎవ, ఞీశీతీఎ, ాతీశీజూవతీ ఋఇఋశీంబతీవ, ాాఅస్త్రశ్రీవ ఖఅం ాఅస్త్రష్ట్ అని వివరించే వారు. ఈ మెళకువ గ్రహించిన వాడు మంచి ఛాయా గ్రాహకు డవుతాడని రాజన్ అంటుండే వారు. పిక్టోరియల్ ఫొటొగ్రఫీలో తనదైన ముద్ర వేసిన రాజన్ బాబు 2011, ఆగష్టు 24 న తన 73వ ఏట, అనారోగ్యంతో, హైదరా బాదులో మరణించారు. రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ వేదికలపై ఫోటో ప్రదర్శనలు ఏర్పాటు చేసి, లెక్కకు మించిన అవార్డులు, బహుమతులు సొంతం చేసుకున్న రాజన్ బాబు ఫోటోగ్రఫీ కళా కారునిగా చిరకాలం గుర్తుండి పోతారు.

# సాహితీ వాచస్పతి దాశరథి



తెలుగు జాతి గర్వించదగిన సాహితీవేత్త దాశరథి రంగాచార్య. అయన చేసిన బహుముఖ రచనలు అనన్య సామాన్యాలు. అసాధారణ మేథో సంపత్తికి ప్రతిరూపాలు. రంగాచార్య రచనల్లో తెలంగాణదనం నిండుగా పరుచుకొని ఉంటుంది. ప్రగతి శీల భావం ఉప్పొంగుతుంది. వేద విజ్ఞానం ఆధ్యాత్మికతను తట్టి లేపుతుంది. తెలంగాణ గ్రామీణ జన జీవనం సాక్షాత్కారిస్తుంది. అందుకే తెలంగాణ ప్రజలు, పోరాట యోధులు, తీవ్రవాదులు, పీడిత తాడిత ప్రజలు, నిరంకుశ పాలన బాధితులు, చరిత్రకారులు, చివరకు భాగవతోత్తములు... ఒక్కొక్కరికీ ఒక్కొక్క రీతిలో ఆత్మీయ రచయితగా నిలిచారు. ఆయన రచయిత, జీవిత చరిత్రకారుడు మాత్రమే కాదు. తెలుగు, సంస్కృతం, ద్రావిడం, హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో గొప్ప పండితుడు, కవి, విమర్శకులు, నాటకకర్త. గొప్ప వక్త. ఏ అంశాన్నైనా అలవోకగా అవలీలగా వీనులకు ఇంపుగా చెప్పగలిగిన వ్యాఖ్యాత. తొలితరం ఉద్యమ రచయిత, తెలంగాణ అజ్ఞాత సాయుధ పోరాట యోధుడు. దాశరథి రంగాచార్యులు 1928, ఆగస్టు 24 న నాటి మహబూబా బాదు జిల్లా, చిన్నగూడూర్ మండలం, చిన్నగూడూర్ లో విద్వాన్ వెంకటాచర్య– శ్రీమతి వెంకటమ్మ దంపతులకు జన్మించారు. పుట్టింది పండిత కుటుంబమే అయినా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు దాశరథి. ఆయన అగ్రజుడు దాశరథి కృష్ణమాచార్యుల నుండి అభ్యుదయ, విప్లవ భావాలను అలవర్చుకున్నారు. తెలంగాణ సాయుథ పోరాటంలో ఇద్దరూ కలిసి పనిచేశారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం సర్కార్ కు వ్యతిరేకంగా పోరాడారు. తెలంగాణ ఉద్యమ జీవితాన్ని సాహిత్య రూపంలో ప్రజలకు అందించారు రంగాచార్య. తెలంగాణ చరిత్ర, ఉద్యమాలు, ప్రజల జీవితం, సాహిత్యం, సంస్కృతి.. ఇలా తెలంగాణకు సంబంధించిన అన్ని అంశాలను రచనల్లో స్పృశించిన సాటిలేని మేటి రచయిత ఆయన. మూడు కావ్యేతిహాసాలను – శ్రీమద్రామాయణము, శ్రీమదాంధ్ర మహాభారతము, శ్రీమద్భాగ వతము, వేదాలు – ఋగ్వేదము, కృష్ణ యజుర్వేదము, శుక్ల యజుర్వేదము, సామవేదము, అధర్వణవేదము ఓకే ఒక్కరుగా సంస్కృతం నుంచి వ్యాఖ్యాన సహితంగా ప్రతికృతి చేసిన ఏకైక రచయిత దాశరథి. ఆరవ తరగతి చదువుతున్నప్పుడే తోటి విద్యార్థులను కూడగట్టి నిజాంకు వ్యతిరేకంగా సమ్మె చేశారు. నిజాం రాజ్యం ఆచంద్రార్కం నిలిచి ఉండాలని పాఠశాలల్లో చేసే ప్రార్థన, తాను చేయడానికి రంగాచార్య నిరాకరించి, నిబంధన మేరకు వారి లాగే కుచ్చు రూమీ టోపీ ధరించడానికి తిరస్కరించి బడి నుండి బహిష్కృతులు అయినారు. ఎక్కడా చదువు కాకుండా నిజాం ప్రభుత్వం ఫర్మానా జారీ చేసింది కూడా. పోలీసు నిర్బంధం, చిత్రహింసల నుంచి తప్పించుకుని అజ్ఞాతంలోకి వెళ్ళి నిజాం వ్యతిరేక పోరాటం క్రియాశీలంగా జరిపారు. తర్వాత నిజాం ప్రభుత్వం వారంటు జారీ చేసినా, రంగాచార్య జాడ కనుక్కోలేక పోయింది. నేరుగా సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. పగలు బడిలో పిల్లలకు పాఠాలు చెబుతూనే, రాత్రుళ్లు రైతు కూలీలకు ఉద్యమ బోధ చేసేవారు. తొలి నవల 'చిల్లరదేవుళ్లు'ను 1969లో వెలువరించారు. ఈ నవల 1974లో చలన చిత్రంగా వచ్చింది. 'చిల్లరదేవుళ్లు' 1938కి పూర్వపు తెలంగాణ ప్రజల జీవనాన్ని చిత్రిస్తే, తెలంగాణ సాయుధ పోరాటంలోని 1942–48 సంవత్సరాల మధ్య కాలాన్ని 'మోదుగు పూలు' నవల వర్ణిస్తుంది. చిల్లరదేవుళ్లు', 'మోదుగు పూలు' వంటి నవల్లో తెలంగాణ పలుకుబడులను – నుడికారాన్ని పలికించారు. స్వాతంత్ర్యం తరువాత రెండు దశాబ్దాల సుదీర్ఘ కాలాన్ని 'జనపదం' నవలలో చిత్రించారు. బుద్ధుని జీవిత చరిత్రను 'బుద్ధ భానుడు' పేరుతో అపురూపమైన రచనను 2010 సంవత్సరంలో వెలువరించారు. 1994లో హరివంశ సహిత 'మహా భారతం' రచించారు. 1940ల్లో కోల్ కతాలో వచ్చిన కరువు రక్కసి గురించి ప్రఖ్యాత భారతీయ ఆంగ్ల రచయిత భవానీ భట్టాచార్య రాసిన నవల ఎవ ష్ట్రశీ తీఱంవం ాౌ అస్త్రవతీ'ను 'దేవుని పేరిట' పేరుతో తెలుగులో అనువదించారు. తొలినాళ్ళలో రంగాచార్య పిల్లలకోసం 'వివేకనందుడు', 'మహాత్ముడు', 'కాళిదాసు' అనే మూడు నాటకాలు రచించారు. 1974లో 'శ్రీ వేంకటేశ్వర లీలలు' రచించారు. వేదాలు సామాన్యుడికి సైతం అందించాలనే ఆలోచనతో 70 ఏళ్ళ వయస్సులో బృహత్ కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. విస్తృత సాహిత్యాన్ని సరళమైన తెలుగులోకి తేవడం, ముద్రణ, పంపిణీ, వ్యాప్తి కళ్ళార చూడడం రంగాచార్య చేసిన శ్రమఫలం, చేసుకున్న అదృష్టం. ఒక జీవితకాలంలో ఇంత చేసినవారు, ఎదిగినవారు మరొకరులేరు.తెలంగాణ జీవితాన్ని లోకానికి తెలియ జెప్పాలనే చారిత్రక దృష్టితో, దృఢ సంకల్పంతో, తెలంగాణ మీద అభిమానంతో, అందమైన శ్కెలిలో రచనా వ్యాసంగాన్ని ఆయన సాగించారు. 1951లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. తరువాత 1957లో సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో చేరి, ఉద్యోగం చేస్తూనే బీఏ, ఎల్ఎల్‌బీ చేశారు. 32 సంవత్సరాల పాటు పనిచే చేసి, 1988లో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. రంగాచార్య 2015 జూన్ 8వ తేదీన కన్ను మూశారు.

# తెలుగు మహిళల హృదయ నేత్రి


ప్రపంచం గర్వించదగ్గ తెలుగు స్త్రీవాద రచయిత్రి మాలతీ చందూర్. చదువు ఎక్కువగా చదువక పోయినా, తెలుగు భాషకు, తెలుగు మహిళకు పట్టాభిషేకం చేసి, సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీతగా గుర్తింపు పొందిన ప్రతిభాశాలి. రచయిత్రిగా, కాలమిస్టుగా, 1950ల నుండి దాదాపు మూడు దశాబ్దాల పాటు తెలుగువారికి ఆమె సుపరిచితం. మాలతీ చందూర్ (1930 – ఆగష్టు 21, 2013) కృష్ణా జిల్లా లోని నూజివీడులో 1930 లో జన్మించారు. ఊర్లో ఉయ్యూరు రాజావారి దివాణం పక్కనే ఎస్ఆర్ఆర్ పాఠశాలలో 8వ తరగతి వరకు ఎస్ఎస్ఆర్ పాఠశాలలోనే చదివారు. 8వ తరగతి పూర్తి కాగానే ఏలూరు వెళ్ళి, అక్కడ వారి మామయ్య (చందూర్) ఇంట్లో ఉండి చదువు కున్నారు. ఏలూరు లోని వల్లూరు సెయింట్ థెరిస్సా స్కూల్లో ఇంగ్లీషు మీడియంలో చేరారు. అప్పుడు చందూర్ గారి ద్వారా డి.కామేశ్వరి, ఆనందా రామం, అరవిందా చారి, సక్కుబాయి వంటి వారితో పరిచయం ఏర్పరుచు కున్నారు. ఏలూరులో వారున్న ఇంటికి దగ్గరగా 'కథావీధి' అనే సాహిత్య పత్రిక ఉండేది. అక్కడికి శ్రీశ్రీ, విశ్వనాథ సత్యనారాయణ, కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు, వెంకటచలం, కావలి లక్ష్మీనరసింగం మొదలైన వారు వచ్చేవారు. 1947లో ఆమె, తన మేన మామ ఎన్. ఆర్. చందూర్ రచయిత, జగతి పత్రిక సంపాదకులు)ను వివాహం చేసుకున్నారు. మద్రాసు చేరుకుని, జార్జిటాన్‌లో అద్దె ఇంటిలో ఉంటూ, మద్రాసులో ప్రైవేటుగా ఎస్ఎస్ఎల్‌సి పూర్తి చేశారు. 1949లో వారి రచనా వ్యాసంగం ప్రారంభించారు. అప్పట్లో రేడియోలో ఆమె రచనలను చదివి వినిపించేవారు. ఆ రోజుల్లో ఎగ్మూర్‌లో ఉన్న రేడియో స్టేషన్‌కు వెళితే ఒక సాహితీ సభకు వెళ్ళిన అనుభూతిని పొందేవారు. అక్కడే ఆచంట జానకిరాం, బుచ్చిబాబు, జనమంచి రామకృష్ణ, పి.వి.రాజమన్నార్, ముని మాణిక్యం నరసింహారావు వంటి వారిని దగ్గరగా గమనించే అవకాశం ఆమెకు కలిగింది. 1952 నుంచి రచనా వ్యాసంగంలో తీరిక లేకుండా గడిపారు. భర్త చందూర్‌ను ఎప్పుడూ "మామయ్య"గానే సంబోధించే మాలతి అన్యోన్య దాంపత్యలో ఆనందాన్ని పొందారు. సంతానం లేని మాలతీ, చందూర్ దంపతులు రచనలే తమ సంతానంగా, సాహితీ ప్రియులే బంధువులుగా గడిపారు. మద్రాసులో తెలుగు సాహితీ సంస్థలకూ, సామాజిక ప్రముఖులకూ పెద్ద దిక్కుగా నిలిచారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ స్థాపించిన 'ఆంధ్ర మహిళా సభ' నిర్వహణలో, అభివృద్ధిలో దంపతులు ప్రధాన పాత్రలు పోషించారు. 1950లలో 'ఆంధ్రప్రభ' వారపత్రికలో 'ప్రమదావనం' పేరిట స్త్రీల కోసం ప్రత్యేకంగా మాలతీ చందూర్‌తో కాలమ్ ప్రారంభించారు. ప్రమదావనం ద్వారా దశాబ్దాల కాలంగా పాఠకులతో ప్రశ్నలు, జవాబులు శీర్షికను విజయ వంతంగా నడుపుతూ, తెలుగు కాలమిస్టుల చరిత్రలో మాలతీ చందూర్ ఓ అరుదైన ఘనత సాధించారు. ఆ శీర్షికలో వంటలు, వార్పులే కాకుండా ఇంగ్లీషు నవలలను పరిచయం చెయ్యటం, విదేశాలలో తిరిగి వచ్చిన వారి చేత వారి అనుభవాలు రాయించటం మొదలైనవి చేశారు. ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చే వారు. ఎప్పుడూ వంటింటికి దూరంగానే గడిపిన మాలతీ చందూర్ రాసిన 'వంటలు – పిండి వంటలు' రచన తెలుగునాట ఎంతో ప్రసిద్ధం. వంటల పుస్తకాలు కొత్తగా పెళ్ళయిన అమ్మాయిలకు ఉపయోగకరంగా ఉండేవి. మాలతీ చందూర్ రాసే "జవాబులు" ఆడవారితో పాటు మగవారు కూడా చదివేవారు.

# హాట్ ఫోజులతో అనసూయ లేటెస్ట్ పిక్స్ వైరల్



అనసూయ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకం చెప్పాల్సిన పని లేదు.. సోషల్ మీడియా లో నిత్యం హాట్ ఫోజులతో అందరిని ఆకట్టుకుంటుంది. బుల్లితెరకు దూరమై వెండి తెరపై నటిస్తూ అలరిస్తుంది. 20 ఏళ్ల కింద వచ్చిన ఎన్టీఆర్ నాగ సినిమా సమయంలోనే సిల్వర్ స్క్రీన్ పై కనిపించింది అనసూయ.తర్వాత కొన్నేళ్లకు న్యూస్ ప్రజెంటర్ మారి ఆ తర్వాత జబర్దస్త్ కామెడీ షో లో యాంకర్‌గా చేసి మంచి పాపులారిటీని సొంతం చేసుకుంది అనసూయ.తర్వాత నెమ్మది గా సినిమాల్లో నటిస్తూ తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. పలు లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లో నటిస్తోంది అనసూయ. అనసూయ తన ఫ్యామిలీ తో కలిసి వెళ్లిన ట్రిప్ కు సంబంధించిన ఫోటోలను, వీడియోలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసుకుంటుంది.అనసూయ వెండితెరపై వరుస ఆఫర్లతో బిజీగా ఉండటం తో బుల్లి తెరకు బై చెప్పి చెప్పేసింది. ఈ జబర్దస్త్ భామ కాల్ షీట్స్ కోసం దర్శకనిర్మాతలు క్యూ కడుతున్నారు. 5వరుస సినిమాలతో అందరిని అలరిస్తోంది అనసూయ భరధ్వాజ్. ప్రస్తుతం అల్లు అర్జున 'పుష్ప2 ది రూల్' లో నటిస్తోంది.



# కన్నప్పలో మంచు విష్ణు కొడుకు.. అవ్రామ్ డెబ్యూ లుక్ రిలీజ్ టైం ఫిక్స్

టాలీవుడ్ యాక్టర్ మంచు విష్ణు లీడ్ రోల్‌లో నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం కన్నప్ప . బాలీవుడ్ దర్శకుడు ముఖేశ్ కుమార్ సింగ్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో గ్లోబల్ స్టార్ ప్రభాస్, కలెక్షన్ కింగ్ మోహన్‌బాబు, మోహన్ లాల్, నయనతార, మధుబాల, శరత్‌కుమార్, శివరాజ్‌కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.కాగా శ్రీకృష్ణాష్టమి సందర్భంగా సోమవారం (ఆగస్టు 26) కన్నప్ప నుంచి ఆసక్తికర అప్‌డేట్ షేర్ చేయబోతున్నారు మేకర్స్. ఈ చిత్రంతో మంచు విష్ణు కుమారుడు అవ్రామ్ సిల్వర్ స్క్రీన్ డెబ్యూ ఇవ్వబోతున్నాడు. కృష్ణాష్టమి సందర్భంగా అవ్రామ్ లుక్ విడుదల చేసున్నారు మేకర్స్. ఇంతకీ అవ్రామ్ ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నాడనేది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది.ఇప్పటికే విడుదల చేసిన కన్నప్ప టీజర్, పోస్టర్లకు మంచి స్పందన వస్తోంది. ఈ మూవీలో బాలీవుడ్ యాక్టర్ అక్షయ్‌కుమార్ కన్నప్పలో శివుడిగా కనిపించబోతున్నాడు. ఈ చిత్రానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ, స్టీఫెన్ దేవసి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయిమాధవ్, తోట ప్రసాద్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు.

# ఆల్ టైమ్ రికార్డు దిశగా గబ్బర్ సింగ్ రీరిలీజ్..

## పవన్ కల్యాణ్ అభిమానులకు పండగే..!

సెప్టెంబర్ 2న టాలీవుడ్ యాక్టర్ పవన్ కల్యాణ్ బర్త్ డేను ఘనంగా నిర్వహించేందుకు అభిమానులు సన్నాహాలు చేస్తున్నారు. బర్త్ డే ట్రీట్‌గా మూవీ లవర్స్ కోసం సెప్టెంబర్ 1న గబ్బర్ సింగ్ 4k రీరిలీజ్ చేస్తున్నారని తెలిసిందే. లాంగ్ గ్యాప్ తర్వాత పవన్ కల్యాణ్‌కు గబ్బర్ సింగ్ రూపంలో గ్రాండ్ సక్సెస్ అందించాడు హరీష్ శంకర్.దబాంగ్‌కు రీమేక్‌గా బండ్ల గణేశ్ నిర్మించిన ఈ చిత్రం బాక్సాఫీస్ రికార్డులను కొల్లగొట్టింది. గబ్బర్ సింగ్ రీరిలీజ్ టైంలో కూడా సేమ్ మేనియాను కొనసాగిస్తోంది. ఈ చిత్రంలో నార్త్ అమెరికాలో 100o లొకేషన్లకుపైగా విడుదలకు ప్లాన్ చేస్తున్నారని.. సెప్టెంబర్ 1న యూఎస్‌ఏ, కెనడాలో హాలీడే కావడం వల్ల ఓపెనింగ్ డేన రికార్డు స్థాయిలో వసూళ్లు రాబట్టడం ఖాయమని ఇప్పటికే ఓ వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది యూఎస్‌ఏలో గబ్బర్ సింగ్ అడ్వాన్స్ బుకింగ్స్ షురూ అయ్యాయి. ఇప్పటివరకు వచ్చిన సమాచారం ప్రకారం రీరిలీజ్ సినిమాల్లో ఆల్ టైమ్ హయ్యెస్ట్ గ్రాస్ సాధించిన తెలుగు సినిమాగా చోటు సంపాదించే దిశగా ముందుకెళ్తోంది. గబ్బర్ సింగ్ ఇటీవలే చిరంజీవి ఇంద్ర రీలిజ్ ట్రెండ్‌ను అధిగమిస్తుండటం విశేషం. గబ్బర్ సింగ్ ఇప్పటివరకు నార్త్ అమెరికాలో 55 స్క్రీన్లలో రూ.12,57,178.50 లక్షలు సేల్స్ నమోదు చేసింది.గబ్బర్ సింగ్‌లో శృతి హాసన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించగా.. బ్రహ్మానందం, కోట శ్రీనివాస రావు, అభిమన్యు సింగ్ కీలక పాత్రలు పోషించారు. రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ అదిరిపోయే ఆల్బమ్ అందించాడు








# ఓటీటీలోకి నిహారిక సూపర్ హిట్ సినిమా.. కమిటీ కుర్రోళ్లు స్ట్రీమింగ్ ఎప్పుడు, ఎక్కడంటే?

మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా మారి నిర్మించిన సినిమా కమిటీ కుర్రోళ్లు. మొత్తం 11 మంది కొత్త కుర్రాళ్లు ఈ సినిమాలో హీరోలుగా నటించడం విశేషం. అలాగే నలుగురు కొత్త అమ్మాయిలు కొత్తగా టాలీవుడ్ ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. యదు వంశీ తెరకెక్కించిన ఈ ఫీల్ గుడ్ సినిమా ఆగస్టు 09న గ్రాండ్ గా రిలీజైంది. మొదటి షో నుంచే సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. పల్లెటూరిలో జరిగే ఓ జాతర, ఎన్నికలను నేపథ్యంగా తీసుకుని కమిటీ కుర్రోళ్లు సినిమాను తెరకెక్కించారు. 1990ల జ్ఞాపకాలను గుర్తుచేయడం, స్నేహితుల మధ్య బంధం, గోదావరి పల్లెల వాతావరణాన్ని కళ్లకు కట్టేలా చూపించడంతో కమిటీ కుర్రోళ్లు థియేటర్లకు ఆడియెన్స్ బ్రహ్మరథం పట్టారు. లో బడ్జెట్ మూవీగా తెరకెక్కిన ఈ సినిమాకు ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.15.6 కోట్ల కలెక్షన్లు వచ్చాయి. మిస్టర్ బచ్చన్, ఇస్మార్ట్ శంకర్ వంటి బడా హీరోల చిత్రాలు రిలీజైనప్పటికీ కమిటీ కుర్రోళ్ళు సినిమా థియేటర్లలో ఇంకా జోరు చూపిస్తోంది. తాజాగా ఈ సూపర్ హిట్ సినిమా ఓటీటీ పార్ట్‌నర్ ఫిక్స్ అయినట్లు సమాచారం. ప్రముఖ తెలుగు ఓటీటీ ప్లాట్ ఫామ్ ఆహా నిహారిక సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను కొనుగోలు చేసింది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ రెండో వారంలో కమిటీ కుర్రోళ్లు సినిమా ఆహాలోకి అడుగు పెట్టవచ్చని సమాచారం. త్వరలోనే దీనికి సంబంధించి ఒక అధికారిక ప్రకటన వెలువడనుందట.కాగా కమిటీ కుర్రోళ్ళు సినిమాను తీసుకునేందుకు ముందుగా ఏ ఓటీటీ ప్లాట్?ఫామ్ ముందుకు రాలేదట. ఈ మూవీ సక్సెస్ ఈవెంట్?లో నిర్మాత నిహారిక కొణిదెల స్వయంగా ఈ విషయాన్ని చెప్పారు. అయితే మొదటి షో నుంచే పాజిటివ్ టాక్ రావడం, భారీగా కలెక్షన్లు రావడంతో ఓటీటీ హక్కులకు డిమాండ్ డబుల్ అయిందని నిహారిక చెప్పుకొచ్చింది. ఈ మూవీలో సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ప్రసాద్ బెహరా, ఈశ్వర్ రాచిరాజు, త్రినాథ్ వర్మ, మణికంఠ పరసు, లోకేశ్ కుమార్ పరిమి, శ్యామ్ కల్యాణ్, అక్షయ్ శ్రీనివాస్, టీనా శ్రావ్య, శివకుమార్, తేజస్వి రావ్, విశిక తదితరులు కీలక పాత్రలు పోషించారు. మెగాస్టార్ చిరంజీవి, మహేశ్ బాబు, రామ్ చరణ్, దర్శక ధీరుడు రాజమౌళి, న్యాచురల్ స్టార్ నాని తదితరులు ఈ సినిమాను చూసి ప్రశంసల వర్షం కురిపించారు.

# ఓటీటీలోకి వచ్చేసిన బాలీవుడ్ సూపర్ హిట్ మూవీ 'ముంజ్యా'



బాలీవుడ్ నటి శార్వారీ వాఘ్, అజయ్ వర్మ ప్రధాన పాత్రలలో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ చిత్రం 'ముంజ్యా'. ఆదిత్య చోప్రా ఫిల్మ్స్ యూనివర్స్ రూపొందించిన స్పై యూనివర్స్‌లో భాగంగా వచ్చిన ఈ చిత్రం హారర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చి రూ.100 కోట్ల కలెక్షన్లు సాధించడమే కాకుండా మంచి సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంది. ఇక ఈ సినిమాకు ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహించాడు.అయితే ఈ సినిమా తాజాగా ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది. ఈ విషయాన్ని మేకర్స్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. బిట్టు (అభయ్ వర్మ) తనకు నచ్చినట్లు బ్రతుకుదాం అనుకుంటాడు. అయితే బిట్టు తల్లి పమ్మి (మోనా సింగ్)కి అతిజాగ్రత్త ఎక్కువ. అందుకే బిట్టును తనకు నచ్చినట్టుగా బ్రతకనివ్వదు. కానీ బిట్టు మాత్రం స్వేచ్ఛగా ఉండాలని కలలు కంటుంటాడు. బిట్టు, పమ్మి కలిసి తమ ఊరిలో ఒక పెళ్లి కోసం వెళ్తారు. అదే సమయంలో ఎంతోకాలంగా తన కోరికను తీర్చుకోవడానికి ఎదురుచూస్తున్న ముంజ్య అనే ఒక పిల్ల దెయ్యం.. బిట్టు వెంటపడుతుంది. తనకు మాత్రమే కనిపిస్తూ తనను టార్చర్ చేస్తుంటుంది. అయితే అసలు ముంజ్య ఎవరు. బిట్టు వెనక మాత్రమే ఎందుకు పడుతుంది. అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613